క్లుప్తంగా

భగవద్గీత పఠన పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు భగవద్గీత పఠన పోటీలలో ప్రతిభ చూపారు. ఇటీవల హిందూపురంలోని చిన్మయ విద్యాలయంలో జరిగిన భవవద్గీత శ్లోక పఠన పోటీల్లో పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నాగమల్లికార్జున, విశ్వనాథ్, మనీష్‌నాయక్, కువల, శివ ప్రతిభ చూపి బహుమతులతో పాటూ క్యాష్ ప్రైజును అందుకున్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో విజేతలను రిటైర్డ్ ఏఎస్ఐ నారాయణ, ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, తులసీరామ్‌ను ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అభినందించారు.

ఐదుగురిపై కేసు నమోదు

పరిగి: మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధి వంగలపల్లిలో గత శనివారం మహిళపై దాడి కేసులో బాధితురాలు శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వంగలపల్లికి చెందిన శివమ్మకు అదే గ్రామానికి చెందిన ఐదుగురితో భూమి విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం శివమ్మపై దాడి జరిగింది. గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోరంట్ల: రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. మండలంలోని పుట్టగుండ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని గుంతపల్లిలో ఆదివారం సర్పంచ్ నార్సిరెడ్డి నేతృత్వంలో మండల కన్వీనర్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఓబుళరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రంగారెడ్డి, హేమసుందరరెడ్డి, సదాశివరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కమిటీలో చోటు

మడకశిర: ఏపీటీఎఫ్ జిల్లా కమిటీలో మడకశిర ఏపీటీఎఫ్ నాయకులకు స్థానం కల్పించారు. ఆదివారం జిల్లా కమిటీని ఎంపిక చేయగా... మడకశిరకు చెందిన గవ్వల రామకృష్ణ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎంపికయ్యారు. జిల్లా కార్యదర్శిగా లతా రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడిగా యంజారప్ప, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులుగా నాగరాజు, శ్యామ్‌సుందర్ ఎంపికయ్యారు.


జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: రాష్ట్రంలో అభివృద్ధి , సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ ఏ బ్లాక్ కన్వీనర్ సాధిక్, 6వ వార్డు ఇన్‌చార్జ్ మల్లికాభాను తెలిపారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ధర్మపురంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

అక్షింతల ఊరేగింపు



గౌడనహళ్లిలో అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: అయోధ్యలో వచ్చే నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. రాముడి కీర్తలను పాడుకుంటూ గౌడనహళ్లిలో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

మడకశిర: సరస్వతీ విద్యామందిరంలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్ నాయకులు సమావేశమయ్యారు. అయోధ్య శ్రీరాముని అక్షింతలు ఇంటింటికీ ఎలా చేర్చాలి అన్న అంశంపై వారు చర్చించారు. జిల్లా అధ్యక్షుడు జంజప్ప, నాయకులు పాల్గొన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

- నడవడానికి కూడా కష్టంగా మారిన రోడ్లకు మోక్షం
- ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారమవడంతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొన్నేళ్లుగా నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారిన రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. ఇప్పుడు ఏకంగా వాహనాలు కూడా సజావుగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టడంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనాలు కూడా సులువుగా వచ్చి వెళ్తున్నాయని చెబుతున్నారు.



కంప చెట్ల మధ్యలో ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ప్రజలు (ఫైల్)



ఎగువ రామగిరి- ఏఆర్ రొప్పం మధ్య ఏర్పాటు చేసిన రహదారి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామానికి రహదారి సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు 10 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బండి జాడులో కంపచెట్లు పెరిగి నడిచి వెళ్లడానికి కూడా వీలు ఉండేదికాదు. తమ కష్టాలను ఎవరు తీర్చకపోవడంతో చేసే ఏమి లేక గౌరిపురం అనే గ్రామానికి వెళ్లి అక్కడి నుంచి ఏఆర్ రొప్పం గ్రామానికి వెళ్తుండేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రెండు గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎంపీపీ కవిత... ఎమ్మెల్యే తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తిప్పేస్వామి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా వెంటనే మట్టి రహదారి సౌకర్యం కల్పించాలని మండల ప్రజా పరిషత్ నుంచి దాదాపు రూ.5 లక్షలు నిధులను విడుదల చేయించారు. జేసీబీతో ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామ సమీపంలోని రంగస్వామి దేవాలయం వరకు దాదాపు రెండు కిలో మీటర్లు వరకు కంప చెట్లును తొలగించి మట్టిని తరలించి సుందరంగా మట్టి రహదారి సౌకర్యం కల్పించారు. రహదారి ఏర్పాటుతో రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులకు ఎంతో అనుకూలంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఏఆర్ రొప్పం గ్రామ సచివాలయానికి పనుల నిమిత్తం వెళ్లే వారికి అనుకూలంగా మారింది.

ఎవరూ పట్టించుకోలేదు



ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామానికి దారి లేక ఇబ్బంది పడేవారం. గతంలో మా కష్టాలను ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మా గ్రామంలోనే గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థుల చదువును ప్రోత్సహించారు. ముఖ్యంగా ఎగువ రామగిరి నుంచి మా గ్రామానికి మట్టి రహదారి వేయడంతో ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంది.

– విశ్వనాథ్, ఏఆర్ రొప్పం, మడకశిర

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక గ్రామాల ప్రజలు పదేళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను పరిష్కరించాం. మండల ప్రజా పరిషత్ నిధులతో మట్టి రోడ్డును ఏర్పాటు చేయించాం . దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి.

– ఎంపీపీ కవిత, మడకశిర



చిగతూర్పి - గొల్లపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి

గుడిబండ: మండల పరిధిలోని చిగతూర్పి నుంచి గొల్లపల్లి గ్రామానికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక ఇరు గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామానికి వెళ్లాలంటే ప్రధాన రహదారి గుండా వచ్చి చుట్టూ ఐదు కిలోమీటర్ల దూరం తిరుక్కొని గ్రామానికి వెళ్లాల్సి ఉండేది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. వైస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్తులు రోడ్డు సమస్యను ఎమ్మెల్యే తిప్పేస్వామికి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి అవసరమైన రూ.10 లక్షలు నిధులను కూడా మంజూరు చేయించారు. దీంతో రహదారి నిర్మాణం చేపట్టి ఉపయోగానికి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చిగతూర్పి నుంచి గొల్లపల్లి గ్రామం వరకు సుమారు రెండు కిలో మీటర్లు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లను కూడా తొలగించారు. తర్వాత రోడ్డుపైకి మట్టిని వేసి సుందరంగా రహదారి నిర్మించడంతో మూడు గ్రామాల ప్రజలకు అనుకూలంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు.

108 వాహనం రావాలన్నా ఇబ్బందే



గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఎన్నో ఏళ్ల ఇబ్బందులు పడ్డాం. ప్రభుత్వాలు ఎన్ని మారిన కూడా రోడ్డు సమస్య మాత్రం తీరలేదు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో 108 వాహనం కూడా రావడానికి ఇబ్బందిగా ఉండేది. రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామస్తుల సమస్యలను గుర్తించి కొత్తగా రోడ్డు వేయడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. - చంద్రప్ప, గొల్లపల్లి

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



గ్రామానికి కొత్తగా రోడ్డు నిర్మాణం కావడంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. గొల్లపల్లికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మించడంతో మా కష్టాలన్నీ తీరాయి. ప్రజలు, విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉంది.

- ఆనంద్, గొల్లపల్లి

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ



భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: 'కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాసు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పోరాటలు చేసిన మహనీయుడు. ఆయన స్ఫూర్తితో కురుబ కులస్తులు ముందుకు సాగాలి' అని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మండల కురుబ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా, రాష్ట్ర కురుబ సంఘం నాయకులు, కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామంలో కురుబ కులంలో భక్త కనకదాసు జన్మించారని తెలిపారు. కవిగా, వాగ్గేయకారుడిగా అట్టడుగు వర్గాల్లో చైతన్యం నింపిన మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తిలో కురబ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీ కురబ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించలేదన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక ఎంపీ స్థానంతో పాటు రెండు శాసన సభ స్థానాలను కేటాయించిందన్నారు. కురుబల సాంప్రదాయలను ప్రతిబింబించేలా ఇటీవల జిల్లా కేంద్రమైన అనంతపురంలో గుడికట్లు నిర్వహించడం హర్షణీయమన్నారు.

జ్యోతుల ప్రదర్శన

కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల కురుబ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కురబ కులస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి కనకదాసు విగ్రహం వరకూ అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, అనంతపురం, సత్యసాయి జిల్లాల కురుబ సంఘం అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు, మల్లికార్జున , నాయకులు ఈశ్వరయ్య, క్రిష్ణమూర్తి, చెన్నప్ప, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్, ఎమ్మెల్యే సోదరుడు మల్లికార్జున, మధవప్ప, గోరంట్ల మండల కురుబ సంఘం అధ్యక్షుడు గిరిధర్, గౌరవాధ్యక్షుడు వెంకటేష్, సత్యనారాయణ, రామోహన్, శివ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో ఆదివారం కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కురుబ సంఘం ఆధ్వర్యంలో తొలుత గ్రామంలో జ్యోతులు మోశారు. పూలపల్లకీలో భక్త కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు.



జ్యోతులతో మహిళలు



గొరవయ్యల నృత్యం

భజన మందిర నిర్మాణానికి భూమి పూజ



సత్యసాయి భజన మందిరం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం దగ్గర సత్యసాయి భజన మందిరం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ భూమి పూజచేశారు. సత్యసాయి భజన మండలి సభ్యుల విన్నపం మేరకు స్థానిక విశ్రాంత ఉద్యోగల భవనం పక్కన ఆరు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. దాతల సహకారంతో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భజన మందిరం నిర్మించనున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, ఉప సర్పంచ్ రాజారెడ్డి, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, నాయకులు నాగేనాయక్, హిదయతుల్లా, శివారెడ్డి, శంకర, సుధాకర రెడ్డి, కమ్మరాము, ఎంపీటీసీ సోముశేఖర్, మాజీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, మండల సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఈద్గా జామియా మైదానంలో సప్తగిరి మెడికల్ కళాశాల రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు అభిషేక్, విజయ్ కుమార్, సౌఖ్యం, ఆదర్శ, శేఖర్, జయవర్ధన్‌గౌడ్ వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అనంతరం పలువురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి నూరుల్లా ఖాన్ , టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్, షబ్బీర్, జామియా మసీదు కమిటీ సభ్యులు ఖలీల్, ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా కేంద్రం ప్రారంభం



యోగా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: యోగ సాధన ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోయి ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కేశవులు అన్నారు. పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం ఉచిత నూతన యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్యులు కేశవులు, లక్ష్మీనారాయణ, రమేష్, వెంకటేష్ బాబు, సత్యం, రామకృష్ణలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

గుడిబండ: మండల పరిధిలోని శంకరగల్లు గ్రామ సచివాలయ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారే గౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

కొడిగెనహళ్లిలో...

పరిగి:మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని సచివాలయం -3 పరిధిలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకేశ్ (25)ను చికిత్స కోసం తుమకూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మడకశిరకు చెందిన మృతుడి తల్లితండ్రులు గాజుల సిద్దప్ప, మంగమ్మ కుమారుడి మరణ వార్త విని గుండెలవిసేలా ఏడ్చారు. తుమకూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ గిరీశ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కేఎస్‌ఆర్‌టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నామన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు



గోమాతకు పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పాండురంగనగర్ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, పట్టణ ప్రముఖులు హాజరైయ్యారు. మరోవైపు హిందూపురం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రాచేపల్లి తోటలో ఉసిరిచెట్టు వద్ద వనభోజన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

మానవ హక్కులు పరిరక్షించాలి

పావగడ: ప్రపంచ వ్యాప్తంగా రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన మానవ హక్కులను యుద్ధాలు కాలరాస్తున్నాయని స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయవాది దివ్య ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇతర దేశాలను కబళించి విశ్వ విజేతగా నిలవాలనే నియంత ధోరణితో దేశాల మధ్య పెను యుద్ధాలు జరుగుతుండటం శోచనీయమన్నారు. లక్షలాది మంది ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకుంటున్నారని విమర్శించారు. మానవ హక్కులను పరిరక్షించే బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డీజేఎస్ నాయకుడు నారాయణప్ప, లాయర్ రవి, బీఆర్సి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో అయ్యప్పస్వామి భక్తుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. మరోవైపు ఎంఎం పాళ్యంలో ఆదివారం మధ్యాహ్నం రథంపై అయ్యప్ప స్వామిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

భక్తులకు అన్నదానం

పరిగి: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మండల కోఆప్షన్ సభ్యుడు సలీంఖాన్ ఆధ్వర్యంలో దాదాపుగా 200 మంది అయ్యప్ప భక్తలకు అన్నదానం చేశారు.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా పవన్

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ ఆవరణలో ఆదివారం ఏపీ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా విజయకుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంత్యుత్సవం

- కెంపేగౌడ, బనమయ్య చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు



బైక్ ర్యాలీగా వెళుతున్న యువకులు

అమరాపురం: కుంచిటి వక్కలిగుల ఆధ్వర్యంలో వక్కలిగుల ఆరాధ్య దైవాలైన కెంపేగౌడ , బనమయ్య జయంత్యుత్సవాలను ఆదివారం అమరాపురం సాయి విద్యానికేతన్ పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. కెంపేగౌడ, బనమయ్యల చిత్రపటాల వద్ద పూజలు చేశారు. మాజీ మంత్రి నర్సే గౌడ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మాజీ జెడ్పీటీసీ పాండు రంగప్ప, జెడ్పీటీసీ అనంతరాజును సన్మానించారు.



రాష్ట్ర కుంచిటి వక్కలిగ చైర్‌పర్సన్ నళినిని సన్మానిస్తున్న దృశ్యం



భరత నాట్యం చేస్తున్న విద్యార్థులు



దీపాలు చేతబట్టి నృత్యం చేస్తున్న మహిళలు